# భూమడు

"భూమా... ఓరి భూమా....." హోటల్ రాములు కేక.

ఒక చేత్తో చాయిగిలాస, ఇంకో చేత్తో నీళ్ళ గిలాస వాకిట్లకు వచ్చి సాకపోసి చుట్టూ చూస్తూ మరోసారి పిలిచిండు రాములు.

భూమని అలికిడి లేదు. వాకిట్ల సాకపోసిన చాయిని నాకడానికి వచ్చిన కుక్క రాములు కేకకు ఉల్కిపడ్డది. గంపల కింది నుంచి వాకిట్ల వచ్చి రెప్ప గొట్టుకుంటున్న కోడి పుంజులు రెండు బెదిరిపోయినయి. అవి భూమన్ని పిలుస్తున్నట్టు పాతగోడ ఎక్కి కూతలు పెట్టినయి.

"అరే...పోరడు ఎటువాయె... ఈ పాటికి వచ్చేటోడు. నేను కొద్దిగలేటయితే తలుపుగొట్టి పిలిచెటోడు. జరం ఎక్కువయిందా ఏంది? అసలే గున్యా జరాలత్తున్నయి" అనుకుంటూ ఇంకోసారి పిలిచిండు రాములు.

బలబల తెల్లారుతోంది. పాల మోటరు చప్పుడు విని కొందరు పాల చెంబులతో పరుగు పెడుతున్నారు. పొద్దటి బస్సుకు పోయేటోళ్ళు సంచులు సామాన్లతో ఆగమాగాన పోతున్నరు.

పాలు తాగి బజార్ల కచ్చిన సంటిదుడ్డెలు అటూ ఇటూ గంతులేత్తున్నయి. కుడిది తాగి బయటకొచ్చిన బర్లు అటూ ఇటూ చూస్తూ మంద సాగుతున్నయి.

పెండకోసం తట్టలు పట్టుకుని నిలబడ్డోళ్ళు బర్ల తోకలనే చూస్తూ "పెండ పెండ అది నా పెండ" అని పేర్లు పెట్టుకుంటున్నరు.

రాములు అందరిలో భూమన్నే వెదుకుతున్నడు. "ఏటువాయె... ఏమాయె" అన్న తండ్లాట మొదలయింది. ఇంకోసారి "ఓరి భూమా...." అని పిలిచిండు. పిలిచి ఆశగా అటూ ఇటూ చూస్తూ అక్కడే నిలబడ్డడు.

ఎంకటి లోపల చాయిగిన్నెలు గిలాసలు కడుగుతోంది. కడుగుతూ భర్త పిలుపు వింటోంది. బులోర్ మీద చాయమరుగుతుంది. చాయ పొంగి పోతుందేమోనన్న భయం కోపంగా మారింది. అదే కోపంతో "నీ భూమనింట్ల పీనుగెల్ల... ఉద్దరిచ్చిండని భూమా ... భూమా... అని కలువరిత్తండు. భూమడులేడు గీమడులేడుగని చాయి పొంగుతుంది సూడూ" అన్నది.

ఆగమాగాన బులోర్ దగ్గరికి వచ్చిండు రాములు. అగ్గిరాజుకుని మండుతుంది. చాయగిన్నె మూత తీసి కలిపిండు. అగ్గిమీద నీళ్ళను జిలుకరిచ్చి వచ్చి బయట నిలబడ్డడు.

రాములును కోపంగా చూసింది ఎంకటి. "మల్లా అవుతలికే పోతన్నడు సూడు... పిచ్చోడుగాడు.... మంచోడుగాడు.." అని పండ్లు కొరుకుతూ ఆ కోపాన్ని గిన్నెల మీద తీస్తున్నది.

చలికాలం పొద్దు పొడువకముందే గిరాకి మొదలయితది. గిన్నెలు కడిగి హోటలంతా ఊడ్చింది ఎంకటి. కుర్చీలు తుడిచింది. అయినా రాములు రాలేదు. బయటనే ఉన్నడు.

"పొయ్యిమీద చాయ పెట్టి బయట నిలబడ్డడు. అది పొంగిపోవాలె... అప్పుడు నీ సంగతి చెప్పుత.... భూమా.. భూమా... తిన్నా భూమడే పన్నా భూమడే...మొన్న వాళ్ళు వచ్చి తన్నిపోయింది సోయిలేదు"కోపంగా అనుకుంది ఎంకటి.

బుస్సుమని చాయ పొంగింది. ఆ సప్పుడుకు ఉరికచ్చి నీళ్ళు చల్లిండు రాములు. ఎంకటి కండ్లు ఎర్రబడ్డయి. చాయి పొంగినట్టు కోపం పొంగింది. 'ఎట్ల...నేను ఏం చెయ్యాలె...లాభం గువ్వలకు తెత్తివి" అంటూ గొంతు ఎత్తుకోబోయింది.

అప్పుడే "చాయ అయిందారా... పనున్నాలేకపోయినా లెవ్వంగనే ఇదో అలువాటయింది" అంటూ అన్న వరుసయ్యే శీను వచ్చిండు. ఎంకటి నోరు మూతపడ్డది. సూపు మాత్రం అగ్గి గురుత్తుంది.

"అబ్బా... బతికితిరా కొడుకా" అనుకున్నడు రాములు. చాయ కాకపోయినా 'ఆ... అయిందన్నా...దా... కూసో' అన్నడు చాయను ఎత్తిపోత్తూ.

"ఏందిరా... మరుదలు గరం మీదున్నది. ఏం సంగతి" శీను అడిగిండు.

"ఏం లేదుగనీ ... శీనన్నా... నువ్వు పెద్దమ్మ వాడనుంచే అచ్చినవా..." అడిగిండు రాములు.

అప్పుడే ఇంట్లకు పోతున్న ఎంకటి భర్త మాటలకు ఆగి ఎనక్కు తిరిగి కోపంగా చూసింది. రాములు భార్యను చూడలేదు. చాయను మరుగబెడుతూనే "అటు దిక్కు భూమడు కనవడ్డాడే... పోరడు నిన్నటి నుంచి పత్తలేదు" అడిగిండు.

"వాని పిచ్చి పీసునెగొడుదు. పిచ్చిముండ కొడుకు. సదువు కొమ్మని హాస్టళ్ళ ఏసింద్రట. పట్టపగలు దెంకచ్చిండు. ఎవలో వానికి బీడి అలువాటు జేసింద్రు. కనవడ పాప. అన్నా బీడియ్యే... అన్నో బీడియ్యే... అని ఎంట పడుతడు. ఏదన్నా పనిజెప్పితే బీడిత్తేనే చేత్తనంటడు" శీను అన్నడు.

ఇంకా ఏదో అడుగబోయిండు రాములు. ఎంకటి కోపం ఆపుకోలేక పోయింది. "అయ్యోడు గాదు... అవ్వోడు గాదు జంగమోన్ని వట్టుకుని జాముసేపు ఏడ్సినట్టు... భూమడు భూమడని నిన్నటినుంచి కలువరిత్తన్నవు. పైత్యం లేసిందా.... నోరుమూసుకో" అన్నది.

రాములు గజ్జుమన్నడు. శీను మాత్రం నవ్వుతూ "ఎందుకే కోపం...వాడు నీకోసమే తండ్లాడుతండు. గిన్నెలో గిలాసలో కడుగుతడని ఆసపడుతుండు" అన్నడు.

"అబ్బో... తండ్లాట... చిన్నతండ్లాట గాదు. అట్ల తండ్లాడుతుంటే మంచిగనే ఉండు. అదిగాదు. వాడు ఆగమైండట. వాన్ని తొవ్వకు తెత్తడట...." అంటూ దూలానికి యాలాడగట్టిన అట్టముక్కను చూపెడుతూ "వాళ్ళు మొన్ననే మోరొత్తి బోర్డుకట్టి పోయింద్రు. శిగ్గుశెరంలేదు. వాని పేరెత్తకుమంటే ఎత్తుతడు" అన్నది.

"చాయ అయిందారా.... అబ్బ.... సలివశమైతలేదు" అప్పుడే వచ్చిండు రాజం.

"ఆ కూసో... అయింది" అంటూ గిలాసల చాయ పోసి ఇద్దరికీ ఇచ్చిండు రాములు. ఎంకటి ఇంట్లకు పోయింది.

భార్య లేకపోవడం చూసి "రాజన్న ... భూమడు కనబడ్డాడే..." అడిగిండు రాములు.

"ఎందుకురో...మల్లా వోటళ్ళ పనికి పెట్టుకుంటావా ఏంది? అసలే కొత్తకానూను వచ్చింది. లోపలేసి తొక్కుతరు" రాజం అన్నడు చాయ తాగుతూ.

రాములు మనసు నొచ్చుకున్నడు. "అట్ల గాదే...నిన్న పొద్దున కనవడ్డడు. జరమచ్చినట్టుంది. పెయ్యి మసులుతుంది. గోలీలు ఇస్తరారా అని చెప్పిన. పత్తలేడు" అన్నడు.

"వాడోబిత్తిరోడు. వోటల్ల ఉన్నప్పుడు గుండుకు గుండు మంచిగుండె. ఇప్పుడు లేనిపోని అలవాట్లయినయి. మొన్న దాతికాడికి నాగలి ఎత్తుకపోరా అని చెప్పిన. బీడి ఇత్తేనే ఎత్తుకపోతనంటడు. నేను బీడితాగకపోతి. రెండు రూపాయలిత్తరా అన్నా తీసుకోడు ఆఖరికి ఒక బీడి అడిగిత్తే కదిలిండు" చెప్పిండు రాజం.

"మొన్న తిండిలేదు. తిప్పల్లేవు. బీడీలు తాక్కుంట కుమ్మరోళ్లకు పొద్దంతా వడ్లు మోసిండు..." శీను చెప్పిండు.

"మొన్న ఆకలి మంటకు రెండు కల్లులొట్లు ఇదుసుకుని తాగిండట. దిక్కులేని పోరడాయె. ఎవలేమంటరు. దంచిందానికి భుక్కిందే కూలి అన్నట్టు పొద్దంత లొట్లు మోపిచ్చిండ్రట" రాజం చెప్పిండు.

రాములు మనసు తల్లడిల్లింది. భూమడు కండ్లముందు కదిలిండు. వాడు ఆకలితో దీనంగా చూస్తున్నట్లు అనిపించింది. వాని తల్లి వాని కోసం కలువరిత్తున్నట్టు అనిపించింది.

"పోరని జాడ ఎక్కడదొరకలె.. యాల్లకు బుక్కెడు తిండిపెడదామన్నా భయమే ఉందన్నా... ఎదురుంగ వోటలోడు నన్నేకావలిగాత్తుండు. ఎవలో పెద్దసారట. మండలం నుంచి ఫోన్ జేసి బెదిరిత్తండు. నాకు రిమార్కు తేవద్దంటండు" బాధగా చెప్పిండు రాములు.

అతని మాటలు పూర్తికాకముందే ఇంట్లో నుంచి బయటకచ్చింది ఎంకటి. "పెడుతవు... పెడుతవు... తిండిపెడుతవట తిండి. ఎరుకలి ముసలిదానికి పెట్టి పెట్టి ఎల్లెనుకల వడ్డవు. వచ్చిన మాటలు సాలలేదా..." అన్నది కోపం.

చాయ గిలాస కింద పెడుతూ "అనవుసరంగా వాన్ని తిడుతవెందుకే ఎంకటీ.... ఎరుకలి ముసలిదే పైస పలం మీ దగ్గెరనే దాచిందట..." అన్నడు శీను నవ్వుతూ.

ఎంటనే అందుకుంది ఎంకటి. "అదే బదునాం వత్తదంటున్న. పొద్దులేదు మాపు లేదంటే మేమే బుక్కెడు పెట్టినం. చాయ పోసినం. పండు కాయ

చేతులేసినం. మాలువాయె. మాటచ్చె. సచ్చినంక కొడుకులతోని బదునామైతిమి" అన్నది.

చాయ తాగడానికి ఇంకో ఇద్దరు ముగ్గురు వచ్చింద్రు. భూమని గురించి మాట్లాడుతున్నరు.

"పిచ్చిముండ... ఎవనికి కన్నదో.. ఏడ పెంచిందో... ఇక్కడ ఇడిసి పాయె... వీడు ఆకారం మంచిగున్నది గనీ ఎడ్డి సన్నాసాయె. రెండు మూడేండ్లు అయిందారా రాములు వీడు వచ్చి..." శీను అడిగిండు.

రాములు ఏళ్ళు లెక్క వెడుతున్నడు. రాజం అందుకుని "ఇదే కార్తీకమాసం. నేను నువ్వు కట్టె గొట్టంగ అవ్వకొడుకులిద్దరు వచ్చింద్రు. దోసెడు నువ్వులు పెట్టి తోలిన.. నాలుగేండ్లు దాటింది" అన్నడు.

"వాని తల్లి సచ్చి మాత్రం రెండేండ్లు దాటింది. దిక్కులేని పోరడని దగ్గరికి తీసిన. ఈ యాడాదిల కొద్దిగ తొవ్వల పడ్డడంటే... ఈ ఆరు నెల్లల్ల ఆగమైపాయె.. ఏమన్న పాడుగాని గనీ జరమొచ్చింది గదా..." రాములు అన్నడు బాధగా.

ఎంకటి మాత్రం కోపంగా "వడ్లు వాగుల పోసీ. గడ్డి గాడుపులపోని. మనకెందుకట. గాలికి పోయే కంపను తలుగవెట్టుకోకు. జరంరానీ... సావనీ... నీకెందుకు...? నీది నీకు సోయిలేదు. రేపు లేదు ఎల్లుండి సంఘంల చిట్టి పైసలు కట్టాలె. అవి ఎక్కడ తెత్తవో తేపో... ఎవలనడిగినా మూడు రూపాయల మిత్తి అంటుంద్రు. అసలు రంది లేదుగనీ భూమడు భూమడంటున్నవు..." అన్నది.

రాములు నోరు తెరువలేదు. నిన్న భూమన్ని చూసిందే యాదికత్తుంది. మొఖమంతా గుంజుకపోయింది. బియ్యం బస్తా ఎత్తుకునిపోతండు. ఎంట బాలయ్య సేటు ఉన్నడు. "నడువు...నడువు" అని తొందరపెడుతున్నడు.

"అరే... ఆ పోరనికి అంత బరువు ఎత్తుతవా.. నువ్వు ఎత్తుకపోనుంటివి. నీ కొడుకైతే అట్లనేజేత్తువా... పైగా జరమచ్చింది" కోపంగా అన్నడు రాములు.

"వానిది నొత్తంది... నీది నొత్తంది...నువ్వు రోజూ గిన్నెలు గిలాసలు కడిగిస్తే ఏంలేదుగనీ...నాకు ఒక్కనాడు పనిజేత్తెనే జరమచ్చిందా.. నీ కడుపుబ్బుడు పిసునెగొడుదు" తిట్టిండు బాలయ్య.

"భూమా... అప్పటికిరారా... గోళీలిత్త" రాములు అన్నడు బాధగా.

"బీడిత్తవా మరి.. వత్తగనీ" భూమడు అన్నడు.

రాములు పొద్దంతా చూసిండు. భూమడు రాలేదు. పొద్దున చాయ తాగడానికైతే తప్పకుండా వత్తుండె. ఇప్పుడు రాకపోయేసరికి రాములుకు భయం మొదలయింది. అంతకు ముందురోజే బస్సుల రాంగ భూమని తల్లిని చూసిండు.

బులోర్ మీద చాయ మరోసారి బస్సుమని పొంగింది. కమురువాసన లేసింది. "అగోజూడు...నేను చెప్పలే! సంసారముంచవు. నాశినంజేత్తవు. నీ ఇల్లు మునుగ...పొద్దున పొద్దున చాయపొంగవెడితివి..." తిట్లకెత్తుకుంది ఎంకటి.

రాములు భయంభయంగా బులోర్ చుట్టూ కారిన చాయను తుడిచిండు. మూతనూ గిన్నెనూ తుడిచి బులోర్‌మీద పెట్టి తిప్పిండు. గుర్రుమని బులోర్ తిరుగుతుంటే అగ్గి మిరుగులు లేచినయి.

చాయ తాగడానికి ఒకరు ఇద్దరు వస్తున్నరు పోతున్నరు. రాములు అడుగుతున్నడు. ఎంకటి తిడుతున్నది. భూమని జాడమాత్రం లేదు. రాములు మనసు తండ్లాడుతనే ఉంది.

"ఈ మధ్య కరెంటు మోటార్ల దగ్గెర కావలుంటున్నడు" ఒకలు చెప్పిండ్రు.

"ఏంతింటుండో.... యాడ పంటుండో తెలువది. వానికి లేని అలువాటు లేదు. పసిపోరన్ని చెడగొట్టిరి. సదువుమీద పోయినా మంచిగుండు. గవుర్మెంటు సదివిత్తుండె" ఒకలు అన్నరు.

ఎవలేం చెప్పినా రాములు మనసు భూమని చుట్టే తిరుగుతుంది. వాన్ని చూడాలనే ఆదుర్ద గడియగడియకూ పెరుగుతంది.

పొద్దుబారెడెక్కింది. గిరాకి పెరిగింది. చాయపత్త చెక్కెరి నిండుకుంది.

"అయ్యో...చెక్కెరి అయిపోయింది. తేవన్నాయే" అడిగిండు రాములు.

ఇంకోసారి అయితే "ఆ... నువ్వు దెత్తవు. నేను సూత్త. దున్నంగపోయి దులుపంగ వత్తవు... నేనే తెత్త' అంటుండె. ఏ ఆలోచనలో ఉందోగనీ 'ఊ' అన్నది ఎంకటి.

"అబ్బ... దొరికెర సందు" అన్నట్టు గల్ల తెరిచి పదినోట్లను రెండు అందుకుని బయటకు నడిచిండు రాములు. కూరగాయల మార్కెట్‌ల, గాంధీ గద్దెమీద, టేలర్ల ముందు, పంచాది ఆఫీసుల భూమని కోసం చూసిండు. జాడ దొరకలేదు. వచ్చి కచీరు గోడకు ఆనుకుని నిలవడ్డడు.

రకరకాల మనుషులు. ఎవల పనుల మీద వాళ్ళు అటూ ఇటూ తిరుగుతున్నరు. అందరి మొఖాల్లోకి పరిశీలనగా చూసిండు రాములు.

ఎవరి మొఖంలో ఆందోళన లేదు. భూమని గురించి పట్టింపు ఎవరికీ లేదు. చాలామంది భూమనితో పనితీసుకున్న వాళ్లే, ఎరువు బండికట్టి తిప్పుకున్న ఎంకట్‌రెడ్డి, బిడ్డ పెండ్లి పనులు ఎల్లదీసుకున్న గోపాల్, పాయికాన ఎత్తి పోయించిన గునమ్మ.... చిన్నపని పెద్ద పని చేయించుకున్నోళ్ళందరూ ఉన్నరు. ఎవలూ భూమని గురించి ఆలోచిస్తున్నట్టు కనిపించలేదు.

"ఎవలకూ లేని ఆరాటం నాకెందుకు" అనిపించింది రాములుకు. అదీ క్షణమే. తర్వాత రెట్టింపు వేగంతో స్పందన పుట్టుకొచ్చింది. భూమని గురించి దేవులాట మొదలయింది.

"ఏంరా... బామ్మరిది. ఏమో బీరిపోయినవు... హోటల్ బందువెట్టినవా" తిరుపతి పిలుపుతో ఆలోచనల్లోంచి తేరుకొన్నడు రాములు.

"ఏం లేదు బావా... వట్టిగనే..." అంటుండగనే తిరుపతి నెలరోజులకింత చెప్పిన సంగతి యాదికచ్చింది రాములుకు.

ఆనాడు హోటల్‌లో చాయతాగుతూ "రెండేండ్లనుంచి ఎంత కట్టడి చేసినా కాని పని రెండు బీడీల కట్టలతో అయిందిరా... ఎడ్లకొట్టం సుట్టూ దొడ్డికి పోదురు. రోత తొక్కనిది లోపలికి పోరాకపోతుండె. ఎంత జెప్పినా అదే వరుస. మొన్న రెండు బీడీకట్ట లిచ్చి భూమన్ని కావలిపెట్టిన. వచ్చినోళ్ళయి వచ్చినట్టు ముంతలు గుంజుకున్నడు. వాని ఈపు పగిలింది గనీ మదుగులేకుంట బోయింది" అన్నడు నవ్వుతూ.

ఈ రోజు కూడా అక్కడనే కావలి పెట్టిండేమోనన్న అనుమానం వచ్చింది రాములుకు.

మెల్లగా ఆరాతీత్తున్నట్టు 'నీ ముంతల కావలి ఎంతదూరమచ్చే బావా..." అడిగిండు రాములు.

తిరుపతి బస్సుమన్నడు. కోపంగా ఇరుగజూసి కాండ్రించి తుపుక్కున ఊంచిపోయిండు. రాములు మనసు నొచ్చుకున్నడు. భూమనిగురించి ఎవరినీ అడుగాలనిపించలేదు. సక్కగ గోపాలసామి గుడి ముందు నుంచి పాత బస్టాండు పోయిండు. అప్పుడప్పుడూ అక్కడ నిద్రపోవడం ఎవరినో బస్సు ఎక్కించడం, బస్సు దిగినవాళ్ళ సామాన్లు మోయడం కనిపించింది రాములుకు.

అక్కడ కనిపించిన వాళ్ళను భూమని గురించి అడిగిండు రాములు. భూమడు ఒక మనిషేనా' అని కొందరు చూస్తే "వాని కోసం ఆరాతీసే మనుషులున్నారా' అని ఇంకొందరు చూసిండ్రు. కొందరు ఎకిలిగా నవ్విండ్రు.

అందరినీ దాటుకుని శివుని గుడిముందు నుంచి కొత్త బస్టాండు చేరుకున్నడు రాములు. అక్కడ వాటర్‌టాంక్ ఉంది. నీళ్ళకుండి ఉంది. ఈ నడమ అక్కడనే స్నానం చేస్తండు. నీళ్ళు తాగే బర్లతో ఆడుకుంటుండు. ఒకటి రెండు సార్లు బెదిరించినా మానలేదు. అక్కడ చూసిండు రాములు. భూమడు లేడు.

కొత్త బస్టాండు సందడిగా ఉంది. భూమని జాడ మాత్రం కనిపించలేదు. అటుగా వచ్చిన సుంకరి మల్లయ్యను ఆపి భూమని గురించి అడిగిండు రాములు.

"ఏ భూమడురా... తొక్కల భూమడు... నా ఆగం నాకుంది. సచ్చినా ఆగమే.. పుట్టినా ఆగమే మాకు... సావులు పుట్టుకలన్నీ మా గండాననే..." నడుస్తూ అన్నడు మల్లయ్య.

అతని కూడా నడుస్తూ "వాడేనే ఎడ్డి భూమడు నిన్న జర మచ్చింది. గోలీలు ఏత్తామని తిరుగుతున్న" అన్నడు రాములు. సుంకరి మల్లయ్య రాములును కిందికి మీదికి చూసిండు.

"గోలీలకేనో... మల్ల హోటల్ల జీతముంచుకుంటవో.... ఈసారి ఉంచు కుంటే మాత్రం కేసయితది. ఎమ్మార్వో మాకు గట్టిగ చెప్పిండు. అయినా వాన్ని పట్టుకపోయి బడిల ఏసిరి గదరా..." అన్నడు మల్లయ్య.

"వాడు బడిల ఇముడుతాడే... రెండు రోజులకే దెంకచ్చిండు. అప్పటి నుంచి ఆగమై తిరుగుతుండు. ఊరందరు వాన్ని ఎట్టికి వాడుకుంటుండ్రు. రెండేండ్ల పొద్దు నాదగ్గరున్నడు. తిన్నడు పన్నడు నిండు గుండె.. పోరడు ఇప్పుడు పొరుక పొరుకయిండే" చెప్పిండు రాములు.

మల్లయ్య బరిసెకట్టెతో ఆగమాగాన పోతూ "నిన్ననైతే సాకలిండ్లల్ల కనవడ్డడు.... నువ్వన్నట్టు జరమచ్చినట్టుంది. యాపచెట్టుకింద మలుసుకపన్నడు" అంటూ వెళ్ళి పోయిండు.

రాములకు కొద్దిగా ఆశపుట్టింది. పోయిన పాణం వచ్చినట్టయింది. బట్టల ముల్లెతో అటునుంచే పోతున్న సాకలి పెద్దవ్వను ఆపి "పెద్దవ్వా.... గా ఎడ్డి భూమడు కనవడ్డడా.... అటు దిక్కు" అని ఆగిండు.

పెద్దవ్వ యాష్టగా "భూమడు లేడు. రామడు లేడు. వాని తలపండు వలుగ. అటుకు మీదకెక్కి నాలుగు పిడుకలు తీసియ్యిరా అన్న. ఇగ వత్తనని పోయిండు. పత్తలేదు జాడలేదు. యాడ మునిగిండో" అన్నది గులుక్కుంటూ.

రాములుకు కోపమచ్చింది.

"నిన్ను పెద్దూరు వాగుల బొందపెట్టిన్నాడు వత్తడు తియ్యి.... నీ ఆరాటం అడివిలవోను..." అనుకుంటూ ముందుకు నడిచిండు రాములు.

తన మాటలు పెద్దవ్వకు వినపడయనుకున్నడు కాని విన్నది. ముల్లెకిందేసి తాతలను తండ్రులను తిట్లతో కడుగుడు మొదలువెట్టింది. ఆ తిట్లు విని నడక వేగం పెంచిండు రాములు తననుకాదన్నట్టు.

ఇద్దరినీ చూస్తున్న పకీరు బషీర్ "ఏంటిదన్నా ముసలవ్వతో పెట్టుకున్న ట్టున్నవు. ఇయ్యాల్ల తెగుతదా" అని అడిగిండు నవ్వుతూ.

సంగతంతా చెప్పిండు రాములు. బషీర్ రాములును అనుమానంగా చూసిండు.

"అగో... నీకు భూమడెందుకు. ఏసోబుగాడు ఆటాన ఇచ్చి భూమన్ని చీకటర్రలకు తోలుక పోతడట. నువ్వు గూడ గట్లనేనా..." అంటూ పకపక నవ్విండు బషీర్.

రాములు మొఖంల రక్తం పొంగింది. రోమాలన్నీ పొడుసుకుని నిలబడ్డయి. తుపుక్కున ఊంచి తలదించుకున్నాడంటే కల్లుడిపో ముందు ఎత్తిండు. ఎవలనూ అడుగ బుద్ధి కాలేదు. లోపలచూసి బయటకు నడిచిండు.

భూమడు కనిపించకపోయేసరికి ఇంకా పట్టుదల పెరిగింది. "వానికి ఏదో అయింది. ఎవలకు చూసినా జరాలే గదా! ఎక్కడో పడిపోయిండు. వాడు ఎట్ల దొరుకాలె అనుకున్న రాములు. పోషమ్మవాడ పటేండ్లవాడ కిందివాడ అంతా తిరిగిండు. వాడు ఎక్కువగా ఉంటే ఒకటి రెండు. ఇండ్లల్ల మాత్రం ఆరాతీస్తున్నట్టు అడిగి చూసిండు. ఎవలూ తెలువదన్నరు గనీ "అయ్యో... పాపం... ఎటువాయె" అన్న మనిషి లేడు.

భూమడు ఈ రెండు మూడు నెలల నుంచి ఏం తింటండు. ఎక్కడ పంటండు... తలుచుకుంటే భయమయితుంది రాములుకు. గుండె చెరువయి తంది. అదే ఆవేదనతో కచీరు దగ్గరికి వచ్చిండు. ఎదురుగా ఎంకటి కనబడడంతో ప్రాణం దస్సుమంది.

నాగుబాము లెక్కన ఒంటి కాలిమీద లేచింది ఎంకటి. "ఏమాయె... చెక్కరేదీ.... చాపత్తపేదీ...ఎటు తిరుగుతున్నవు... నీ తిరుగుడింట్ల పీనిగెల్ల. అక్కడ గిరాకచ్చె. పోలీసోళ్ళు చెరువు కట్టమీదికి చాయ తెమ్మన్నరట..." బజారు అని చూడకుండనే దండకం అందుకుంది ఎంకటి.

"ఏ ... నేనెటుపోయిన... దొడ్డికి పోవద్దా... వత్తన్న వత్తన్న..." అంటూ చెక్కర చాపత్త కొనుక్కుని హోటళ్ళకు పోయిండు రాములు.

ఆ ఆగంలో కొంత సేపు భూమని ఆలోచనలకు బదులుగా పోలీసుల గురించిన ఆలోచన వచ్చింది.

"ఎందుకచ్చింద్రే వత్తే ఊర్లెకత్తరుగనీ, చెరువు కట్టకు ఎందుకత్తురు" చాయను కేతిర్ల పోత్తూ అడిగిండు రాములు ఎంకటిని.

రాములు భూమని గురించి ఊరుసువడ పోసినట్టు తెలువది...నిజంగ దొడ్డికి పోయిండనే అనుకుంటుంది ఎంకటి. అందకే నెమ్మదిగా ఉంది. "ఆ...ఎవలెందు కచ్చింద్రో... ఎక్కడికచ్చింద్రో అడుక్కుంట కూసుంట. ఇగ నాకేం పని. ఎవలో సచ్చింద్రట, వచ్చింద్రట" అన్నది.

సావుమాట వినంగనే కాళ్ళు కడుపులజచ్చినయి రాములుకు. కడుపుల సలిపుట్టింది. "అయ్యా... ఎవలే సచ్చింది" అన్నడు బీరిపోతూ.

"ఎవడు సచ్చిండో గని చాయతీసుకపో..., లేకుంటే పోలీసులు సంపుతరు" అన్నది యాష్టపడుతూ.

ప్లాస్టిక్ గ్లాసులు చేతుల పట్టుకుని లెక్కపెడుతూ "భూమడు గిట్ల గాదు గదనే..." అన్నాడు భయంగా.

"అయితే పీడ పోతదిపో..." అన్నది ఎంకటి అదే కోపంతో. రాములకు కోపం ఆగలేదు. "బెయిమాన్ ముండ. ఇమానం లేని పీనుగు మోసినోన్ని వట్టిందట. అది నీ అసొంటిదే. మనం అనుకున్నయన్నీ మరిచిపోయినవు. వాని తల్లి పిచ్చిది. వాన్ని యాడనో కొట్టి సంపుతదని తల్లిని ఎడవాపి వీన్ని తెలెదా... చేతవట్టి రీతి నేర్పాలనుకోలేదా.. అంతమరిచినవా... అదేదో కానూనచ్చి పనిల పెట్టుకోవద్దనిరి. ఇప్పుడు వాన్ని ఊరిమీద ఇడిసిపెడుతవా? తల్లి తావుకు వాన్ని కలుపవా? నువ్వు సాది సవరించనప్పుడు వాని తల్లి సాదుకుంటది. సంపుకుంటది..." అన్నాడు.

ఎంకటి రాములను కొత్తగా చూసింది. రాములు తలవంచుకుని సైకిలెక్కిందంటే చెరువు కట్టకిందనే దిగిండు. గుండె దడదడమంటంది. "చెరువు నిండు కుండలెక్క ఉంది. ఆ పిచ్చోడు ఇటు వచ్చినా వత్తడు. నడువంగ నడువంగ కాలుజారితే ఉత్తదేనాయె. ఎంత గతికచ్చెరా... కొడుకా" అనుకుంటు కట్ట ఎక్కిండు.

అతని అనుమానాన్ని మరింత నిజం చేస్తూ కట్టమీద సుంకరోళ్ళు .. ఒకలిద్దరు జనం తప్ప ఎవలూ లేరు. ఉన్నవాళ్ళు కూడా నెమ్మదిగా ఉన్నరు.

"ఊరి మనిషయితే ఊరంత జనం ఇక్కడనే ఉందురు. ఈ ముచ్చట ఊరంత ఎలిసిపారుతుండె" అనుకుంట భయం భయంగా పోలీసులు కూసున్న జాగలకు పోయిండు రాములు.

కిందనే బురద... తుంగ... మోకాలు మంటి బురదలో భూమడు నిలవడ్డడు. బురదలో ఒక స్త్రీ శవముంది. రాములకు ఏదీ కనిపించలేదు. భూమడు ఒక్కడే కనిపించి మనసు పొంగిపోయింది.

"బయటకు పట్టుకరారా... నీకు రెండు బీడీలిత్త" సుంకరి కేక ఏసిండు.

భూమడు శవాన్ని రెండు చేతులందుకుని గడ్డకు గుంజుకచ్చి నీరసంగా కూసున్నడు. సుంకరి శవం మొఖం మీద నీళ్ళు కొట్టి "పిచ్చిది... వీని తల్లే... ఎప్పుడో సచ్చిందనుకున్నం. రెండు మూడేండ్లు ఇక్కడనే ఉండె" అన్నడు.

భూమన్ని అడిగింద్రు పోలీసులు. "అవ్వ... అవ్వ" అన్నడు గనీ దూరం జరిగి కూసున్నడు. రాములు కండ్లల్ల నీళ్ళు తిరిగినయి. భూమన్ని బాధగా చూసిండు. భూమడు దిక్కులు చూస్తూ బీడితాగుతుండు. రాములును చూసి నవ్వి "అన్నా... ఎటుపోతున్నవే" అన్నడు.

"వాగులకు... ఎటుబోతున్నరా! నీకు బుద్ధి జెప్పి గ్యానం జెప్పి తొవ్వకు తేవాలనుకున్న కుదురలేదు. ఎడ్డిదో గుడ్డిదో నీతల్లికి నిన్ను కలుపాలనుకున్న... ఇదీ కుదరలేదు" అనుకుంట కండ్ల నీళ్ళు తుడుచుకున్నడు రాములు.

ఇంకో బీడీ ఇత్తే శవాన్ని కడిగి జీపుల పెట్టిండు భూమడు.

"నీ తల్లి శవాన్ని నువ్వే ఎత్తుకున్నవురా...." రాములు అనుకున్నడు.

జీపుతో పోలీసులు సుంకర్లు వెళ్ళిపోయింద్రు. ఉన్న ఒకలిద్దరు చెరువు కట్ట దిగిపోయింద్రు. అక్కడ రాములు, భూమడు ఇద్దరే మిగిలిపోయింద్రు. భూమడు చలికి గజగజ వణుకుతుండు. బట్టలు బురదతో తడిసినయి.

రెండు గిలాసల నిండా చాయపోసి ఇచ్చిండు రాములు. బురద చేతులతో వణుక్కుంటనే తాగిండు భూమడు.

రాములు కండ్లపొంట నీళ్ళు కారుతనే ఉన్నయి. ఏడుపు ఎత్తేసుకత్తుంది. కడుపుల కార్యం వణుకుతుంది. భూమన్ని దగ్గరికి తీసుకుని "ఎంత పాపపు రాతరా భూమా నీది... తల్లిని గుర్తువడితివి.. ఏడువకపోతివి" అన్నడు.

ఏమనుకున్నడో... భూమడు, తలదదించుకున్నడు. చేతులకంటిన బురదను తుడుచుకున్నడు.

భూమన్ని చెరువుల తానం చేయించి సైకిల్ మీద ఎక్కించుకుని ఇంటికి వచ్చిండు రాములు.

భూమన్ని సూడంగనే ఎంకటి భయపడ్డది. టపటప గాలికి కొట్టుకుంటున్న అట్టబోర్డు వైపు భయంగా చూసింది. "చూసినవా కొంపల గుత్త పనులు జేత్తడు. మల్లెందుకు తోలుకచ్చినవు... కేసులంటరు...జేలంటరు...ఎందుకు ఉంచు కున్నరంటరు" సదువుడు మొదలు పెట్టింది.

రాములు తొనుక లేదు. బెనుక లేదు. కాలివేళ్ళ మీద పైకి నిక్కి అట్టబోర్డును పుట్టుక్కున తెంపిండు. రెండుగ ఇరిసి మండుతున్న పొయ్యిల పెడుతూ "ఎవడే వచ్చేది...? వత్తెరాని. ఆరునెల్లనుంచి పోరడు ఆగమై తిరుగుతుండు. ఎవడచ్చిండే?" అన్నడు కోపంగా.

'ఇక్కడ బాల కార్మికులు లేరు' అన్న అట్ట బోర్డు బరబర మండుతంది.

● విపుల - ఏప్రిల్, 2008 ●